# పెద్దల కోసమే పేదల ఇళ్లు కూల్చివేత

**డా. జిలుకర శ్రీనివాస్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** పెద్దల కోసం పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారని విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.జిలుకర శ్రీనివాస్ ఆరోపించారు. పదిరోజులుగా దీక్ష చేస్తున్న స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల దీక్షకు వివిధ సంఘాలు మద్దతు ప్రకటించాయి.

గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. నగరంలో 300 మురికివాడలు అక్రమమని పేర్కొంటూ కూల్చివేతకు కుట్ర పన్నుతున్నారన్నారు. కూల్చివేతలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. బాధితులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. నిరాశ్రయ శ్రామిక సంఘటన సంస్థ బాధితులకు మధ్యాహ్నం భోజనం అందజేసింది. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, మాల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా. బాబు రావు, వీసీకే పార్టీ నాయకులు మచ్చ దేవేందర్, ఆనంద్, శ్యామ్, డీబీఎఫ్ నాయకులు పులి నవీన్‌కుమార్, కవిత, రామోజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్



బాధితులకు బాసటగా దీక్షలో వినయ్‌కుమార్

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

వివేకానందనగర్ బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించకపోతే నిరసన కార్యక్రమం చేపడతామని బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ. వినయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం బీజేవైఎం, బీజేపీ నాయకులతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధితులకు అండగా ఉంటామని సంఘీభావం తెలిపారు.


మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ కార్వే

## మందుపాతర్ల వినియోగాన్ని నిషేధించాలి

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ శాంతి కోసం మందుపాతర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పలు సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ శాంతి నిరాయుధీకరణ పర్యావరణ పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ కార్వే, నవ భారత్ నిర్మాణ సంస్థ అధ్యక్షుడు సూరేపల్లి రవీందర్, ప్రొఫెసర్ దీక్షిత్, ప్రొఫెసర్ ఆర్.కె.సూర్తి, డాక్టర్ సుధాకర్‌రావు, కొండ సహదేవ్ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా మందుపాతర్లను పూర్తిగా నిషేధించాలని కోరారు. 1999లో ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టూ బాన్ ల్యాండ్ మైన్స్ సంస్థ కెనడా రాజధాని అట్టావాలో మందుపాతర్ల నిషేధంపై సదస్సు నిర్వహించగా అక్టోబర్ టీటీ ఒప్పందం జరిగిందని, దీనిలో 150 దేశాలు సంతకాలు చేయగా భారత్, చైనా, అమెరికా సంతకాలు చేయలేదని ఆరోపించారు. మందుపాతర్లు, మందుగుండు సామగ్రి వినియోగం వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రపంచ శాంతి, నిరాయుధీకరణకు అన్ని దేశాలు బాటలు వేయాలని కోరారు.

## 'నాలా నిర్మాణ పనులు పూర్తిచేయాలి'

**అంబర్‌పేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** మోహిన్ చెరువు నుంచి వచ్చే వరదనీరు సక్రమంగా వెళ్లడానికి చేపట్టిన నాలా నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రేమ్‌నగర్ నాలాను గురువారం పరిశీలించారు. 18 నెలల క్రితం ప్రారంభమైన నాలా పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.


కుష్ఠువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంవో హరిశ్చంద్రప్రసాద్

## కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన

**ముషీరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అంతా కలిసికట్టుగా పనిచేయాలని డీపీఎంవో హరిచంద్రప్రసాద్ సూచించారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు స్పర్శ్ లెప్రసీ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని అన్నారు. ఇందుకు సంబంధించి మందులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా లభ్యమవుతాయన్నారు. పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం కాచిగూడ డివిజన్ కాసీరాంజీరా బసంత్ కాలనీలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. గౌతమ్‌రావు మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి మోదీ పథకాలను వివరించాలని కోరారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో 10 ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బస్తీబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, యువమోర్చా నగర కార్యదర్శి ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

## ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడికి బీఎస్ఎస్ఎఫ్ సత్కారం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సలహా మండలి సభ్యుడిగా నియమితులైన పోతరాజు హరికిషోర్‌ను భారతిసేవా సహకార ఫోరమ్(బీఎస్ఎస్ఎఫ్) సత్కరించింది. చిక్కడపల్లిలో సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ హరికిషోర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.


షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నేతలు

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం నేతలు కోరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని గురువారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. షబ్బీర్ అలీని కలిసిన వారిలో వడ్డెరల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డా. ఓర్సు కృష్ణయ్య, శ్రీరాములు, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

**బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారిని**

## సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్, శంకర్, ఆర్.వివేక్

**రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారిని సస్పెండ్ చేయాలని పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు సీనియర్ నేతలు డేవిడ్‌రాజ్, శంకర్‌ముదిరాజ్, ఆర్. వివేక్ ఫిర్యాదు చేశారు. గురువారం రాంనగర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాంనగర్ డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకుడితోపాటు మరికొందరు పార్టీకి, ఎమ్మెల్యే గోపాల్‌కు వ్యతిరేకంగా పనిచేశారని అన్నారు. బీఆర్ఎస్ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులకు పదవులు ఇవ్వాలని కోరారు.

## ఘంటసాల గానం అజరామరం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఘంటసాల గానం అజరామరం అని ఎస్‌బీఐ డీజీఎం గరికపాటి వెంకట్ అన్నారు. శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జ్ఞాపకాలతో పాడుతా తీయగా చల్లగా శీర్షికతో ఘంటసాలతోపాటు ఎస్‌బీ బాలసుబ్రహ్మణ్యం గాన విభావరి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ.. ఘంటసాల గానం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని అకట్టుకుంటుందన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా తెలుగు జాతి ఉన్నంతకాలం ఘంటసాల పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటాయన్నారు. వంశీ రామరాజు, కార్యక్రమ నిర్వాహకుడు గొర్తి చంద్రశేఖర్, గాయనీగాయకులు వైఎస్ రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, శశికళాస్వామి, సురేఖామూర్తి, రేవతి, కేతు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ పరిశ్రమల

## ప్రైవేటీకరణ దుర్మార్గమైన చర్య



నిరసన ర్యాలీలో ఐఎఫ్‌టీయూ నేతలు తదితరులు

**రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సోషల్ సెక్యూరిటీ కల్పించాలనే డిమాండ్లతో మజ్దూర్ అధికార్ అభియాన్, ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీల ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ సంఘాల నేతలు సెంట్రల్ రీజనల్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులను కలిసి డిమాండ్ల కరపత్రం అందజేశారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్ల కృష్ణ, జాతీయ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఓడరేవులు, విమానయానం, ఆయిల్ కంపెనీలు, బ్యాంకులు, కోల్ మైన్స్ తదితర ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ, బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు జె.సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, అనురాధ, విశ్వనాథ్, వరదయ్య, శివబాబు తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుంచి ప్రాణహాని

### రక్షణ కల్పించాలి : బాధితుడు కోరళ్ల కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న కోరళ్ల కృష్ణారెడ్డి

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** భూకబ్జాలకు పాల్పడుతూ దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరళ్ల కృష్ణారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కబ్జాను అడ్డుకున్నందుకు తనపై హత్యాయత్నం చేశారని, తప్పించుకోవడంతో గాయాలతో బయటపడ్డానని తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన బిలిఫ్ ఆస్పత్రి ఎండీ రమాజ్యోతి పాత్ర ఉందని ఆరోపించారు. భూకబ్జాదారుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పహాడిషరీఫ్ పీఎస్ పరిధిలోగల బాసగూడ తండా వద్ద తనకు ఎకరం 21 గుంటల భూమి ఉందని, కొంత భూమిని రమాజ్యోతి బంధువు కబ్జా చేయడానికి ప్రయత్నించాడని, తాను అడ్డుకోవడంతో మారణాయుధాలతో దాడి చేయించారన్నారు. పహాడిషరీఫ్ ఎస్ఐ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని, దీని వెనుక మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాత్ర ఉందని ఆరోపించారు. మహేశ్వరం మండలం, కొంగరకుర్దు గ్రామ రెవెన్యూ పరిధిలో 8 ఎకరాల 24 గుంటల భూమిని జెల్లల లక్ష్మయ్య తనకు విక్రయించాడని, ఇదే భూమిని మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్ చేశాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అనుచరుల పాత్ర ఉందన్నారు. 285 సర్వే నెంబర్‌లో 3 ఎకరాల భూమిని రవీందర్‌రెడ్డి తనకు విక్రయించారని, ఈ భూమిని ఆక్రమించడానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అండదండలతో కొంతమంది భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కబ్జాపై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులకు అండగా నిలుస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేటి నుంచి గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ

**ముషీరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కోసం శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఆజామాబాద్ విద్యుత్ డీఈ కమల్‌కుమార్ తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజా పాలన కేంద్రాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. దరఖాస్తుతోపాటు ఆహారభద్రత కార్డు, విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు అందజేయాలన్నారు. ఆహార భద్రత కార్డులు ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులేనని అన్నారు. ఆరు గ్యారెంటీల కోసం ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్నట్లే ఉచిత విద్యుత్ కోసం ప్రజాపాలన కేంద్రంలో లబ్ధిదారులు సంబంధిత జిరాక్స్ కాపీలను అందజేయాలని కోరారు.

## ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా 12న

**రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలో గల ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా ఈనెల 12వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.హనుమనాయక్ గురువారం తెలిపారు. మేళాలో ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, మెకానిక్ ఆర్ఎన్‌డీ ఏసీ, మెకానిక్ డీజిల్, వెల్డర్ తదితర కోర్సులు పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

## లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బుసమల్ల మైఖేల్ ప్రసన్న గురువారం అనిల్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.


శ్యాంసుందర్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రవిచారి

శ్యాంసుందర్‌నగర్‌లో

## సమస్యల పరిష్కారానికి చర్యలు

**రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** బాగ్‌లింగంపల్లి శ్యాంసుందర్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కె. రవిచారి తెలిపారు. గురువారం శ్యాంసుందర్‌నగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు డ్రైనేజీ, కలుషిత నీరు, లోప్రెషర్, రోడ్లు తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆనందమార్గ్ ఆశ్రమంలో సదస్సులు

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలో గల ఆనందమార్గ్ ఆశ్రమంలో ఈ నెల 9 నుంచి 11 వరకు పలు అంశాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆచార్య ప్రియకోశానంద అవధూత్, ఆచార్య సత్యదేవానంద్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మానవ వికాసానికి ఉపయోగపడే విధంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు యోగా, మెడిటేషన్, బయో ఫిజియో కాస్మోలజీ థియరీ తదితర అంశాలపై సదస్సులు జరుగుతాయన్నారు.

# రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

**రాంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రజకవృత్తిదారుల సంక్షేమానికి వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షుడు గుమ్మడి రాజు నరేష్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరనారి ఐలమ్మ విగ్రహం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, వృత్తిదారులకు ఉపాధి కల్పించాలని, రజక ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలని కోరారు. ఆధునిక ధోబీఘాట్లను ప్రతి మండలం, జిల్లా కేంద్రంలో నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రజకులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం రూపొందించాలన్నారు. రజక నాయకులు ఎం.బాలకృష్ణ, సి.మల్లేష్, ఏదునూరి మదారు, అన్నారపు వెంకటేశ్వర్లు, పాయిరాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## 'సమాఖ్య'ను విచ్ఛిన్నం చేస్తున్న కేంద్రం

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


ధర్నాలో అభివాదం చేస్తున్న బీవీ రాఘవులు, వామపక్ష నాయకులు

**కవాడిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళతోపాటు అన్ని రాష్ట్రాలకు ఇది ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న వివక్షను నిరసిస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద సీపీఎం.. కేరళకు సంఘీభావంగా ధర్నా నిర్వహించింది.

రాఘవులు మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రాల పట్ల చూపుతున్న వివక్షపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేశారని, ఆప్ కూడా నిరసన తెలిపిందని గుర్తు చేశారు. జీఎస్టీ, సెస్, సర్‌చార్జీలను కేంద్రం వసూలు చేస్తున్నదని, అయితే, జీఎస్టీలో కేంద్రం 40 శాతం, రాష్ట్రాలకు 60 శాతం ఇవ్వాలని కేరళ ప్రతిపాదించిందన్నారు. ప్రజలకు మేలు జరగాలన్నా, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నా 60 శాతం నిధులు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు 2015-16లో ఆరు శాతం సెస్, సర్‌చార్జి వసూళ్లు ఉంటే ప్రస్తుతం 12 శాతానికి పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### తెలంగాణకు కేంద్రం చేసిందేమిటి?

2014 తరువాత తెలంగాణకు కేంద్రం న్యాయం చేసిందా? అన్యాయం చేసిందా? అనేది సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని రాఘవులు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి జరిగిన వివక్షపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. శ్వేత పత్రాలు విడుదల చేస్తున్న ప్రభుత్వం, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన వారి వివరాలు కూడా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలేర్లుగా గవర్నర్ల వ్యవస్థ ఉందని విమర్శించారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పౌరుషం ఉన్న గడ్డ అని, ఇక్కడ వారి ఆటలు సాగవని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, డీజీ నరసింహారావు, టి.జ్యోతి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.


శ్మశానవాటిక కార్యదర్శికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## దహన సంస్కారాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

**గోల్నాక, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** దహన సంస్కారాలు నిర్వహించలేని పేదలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. గురువారం తన కార్యాలయంలో గత నెలలో జరిగిన 40 మంది దహన సంస్కారాలకు సంబంధించి రూ. 2 లక్షల చెక్కును అంబర్‌పేట హిందూ శ్మశానవాటిక కార్యదర్శి కుమార్‌కు అందజేశారు. ఎమ్మెల్యే ఐదేళ్ల నుంచి నిరుపేదల దహన సంస్కారాలకు సహాయం చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు జి.ప్రభాకర్‌ముదిరాజ్, పడకంటి అంజయ్యాచారి, పట్లూరి సతీష్ తిదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రోత్సాహకాలు


ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న ఈడీ వెంకటేశ్వర్లు

**బర్కత్‌పుర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగులు, కార్మికుల కృషి వల్లనే ఆర్టీసీ ముందుకు సాగుతోందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కాచిగూడ డిపోలో రీజనల్ స్థాయిలో అత్యధిక ఆదాయం అందించిన కండక్టర్లకు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 28 మంది కండక్టర్లు, డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందజేశారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్లు విజయభాను, సుచరిత, జగన్, కాచిగూడ డిపో మేనేజర్ రఘు పాల్గొన్నారు.



శూలపాణిని సన్మానిస్తున్న మధుసూదన్, జనార్దనమూర్తి

## ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఐఏఎస్ రిటైర్డ్ అధికారి డా. కేవీ రమణాచారి పుట్టినరోజు వేడుకల సందర్భంగా జరుగుతున్న కళాసప్తాహమ్‌లో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంను డా.శూలపాణి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ జడ్జి బూర్గుల మధుసూదన్ పాల్గొని కళాకారులను అభినందించారు. గాయకుడు త్రినాథరావు, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ ద్రావిడ, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొన్నారు.

## బీఎస్ఏ అవార్డుకు రూబీ స్టీవెన్‌సన్ ఎంపిక


రూబీ స్టీవెన్‌సన్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

**అంబర్‌పేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్‌సన్ బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) బెస్ట్ సర్వీస్ సొసైటీ అవార్డుకు ఎంపికయ్యారు. సొసైటీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గురువారం ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూబీ స్టీవెన్‌సన్ మాట్లాడుతూ.. తనను అవార్డుకు ఎంపిక చేసినందుకు బహుజన సాహిత్య అకాడమీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నెల 11న తిరుపతిలో నిర్వహించే బహుజన రచయితల 7వ దక్షిణ భారత మహాసభలో ఆయనకు అవార్డు అందజేయనున్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


బెల్‌సన్‌రాజ్

**కవాడిగూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. హోమ్ నుంచి దివ్యాంగుడు. అప్పులబాధ భరించలేక ఓ వ్యక్తి కనిపించకుండా పోయారు. ఖమ్మం జిల్లా, ఇల్లందుకు చెందిన గౌడ్‌సేన్ జాషువా కుమారుడు బెల్‌సన్‌రాజ్ దివ్యాంగుడు. అతడిని జీరాలోగల హోమ్ ఫర్ డిజేబుల్డ్ అనాథాశ్రమంలో మూడు సంవత్సరాల క్రితం చేర్పించారు. సంక్రాంతి సెలవులకు ఇంటికి తీసుకెళ్లారు. జనవరి 31న తిరిగి హోమ్‌లో చేర్పించారు. ఈనెల 7వ తేదీన బెల్‌సన్‌రాజ్ కనపడడం లేదని హోమ్ నిర్వాహకులు అతడి తండ్రి జాషువాకి ఫోన్ చేసి చెప్పారు. ఆయన హోమ్‌కి వచ్చి సీసీ ఫుటేజీ చూడగా గత నెల 31వ తేదీ రాత్రి బెల్‌సన్‌రాజ్ గోడ దూకి పారిపోయినట్లు ఉంది. కుమారుడి ఆచూకీ లభించకపోవడంతో ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అప్పులబాధ భరించలేక..


ఖదీర్

**అంబర్‌పేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట పటేల్ నగర్‌లో నివసిస్తున్న ఖదీర్(42) మూసారాంబాగ్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. పాన్‌షాప్ నిమిత్తం తెలిసిన వారి వద్ద లక్ష రూపాయలు అప్పు తీసుకున్నాడు. షాప్ సక్రమంగా నడవకపోవడం, అప్పు ఇచ్చిన వారు డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో కొన్ని రోజుల నుంచి షాప్‌కు వెళ్లడం లేదు. ఈనెల 1వ తేదీ ఉదయం సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఖదీర్ ఆచూకీ లభించకపోవడంతో భార్య నిఖత్ ఫాతిమా అంబర్‌పేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.